# సామాజిక ఇస్ప్రహ

జోగారావుకి ఏదైనా పంజేసి సంఘంలో ఓ గుర్తింపు పొందాలనిపించింది.

మొదట్లో వచన కవిత్వం రాద్దామనుకున్నాడు. కాని అది లాభం లేదు. ఎందుకంటే ఈ రోజుల్లో వీధికి నలుగురు వచన కవిత్వం రాసేస్తున్నారు. అంతమందిలో నాకేం గుర్తింపు ఉంటుంది అనుకున్నాడు.

కథలు రాసి, రచయితగా గుర్తింపు పొందడం మంచిదనిపించింది జోగారావుకి.

అనుకోడమే తడవుగా బజారెళ్ళి కాగితాలు కొనుక్కొచ్చుకుని ముందేసుక్కొని కూర్చున్నాడు. వారం రోజులు కష్టపడి ఓ కథ రాశాడు. కొత్తగా కథలు రాస్తున్నాడు కాబట్టి దాన్ని ఎవరికైనా చూపించి అభిప్రాయం అడిగితే మంచిదనుకున్నాడు.

తన స్నేహితుడు రామస్వామికి తను రాసిన కథని చూపించాలని నిర్ణయించుకుని రామస్వామి ఇంటికెళ్ళాడు జోగారావు.

"ఏంటోయ్.... నీ మొహం కళ తప్పినట్టుందేంటి?"

జోగారావుని చూస్తూనే ప్రశ్నించాడు రామస్వామి.

రామస్వామి అలా అడిగేసరికి జోగారావు చెడ్డ సిగ్గుపడిపోయాడు. ఊర్కే మెలికలు తిరిగిపోయాడు.


"హిహి.... హిహి...." అన్నాడు సమాధానం చెప్పకుండా.

"ఏదో సిగ్గుమాల్న పంజేసినోడ్లా ఏంటా నవ్వు.... విషయం ఏంటా దాచకుండా చెప్పు" అన్నాడు రామస్వామి చికాకుగా మొహం పెడ్తూ.

"నేను కథలు రాయడం మొదలుపెట్టాను" అన్నాడు జోగారావు నేలచూపులు చూస్తూ.

"అదా.... అలా చెప్పు!.... ఎందుకబ్బా మొహం ఇలా క
తప్పింది అనుకున్నాను.... సరే.... ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్
చెప్పు.... నీ కథ వేసెయ్యమని చెప్పి రికమండేషన్ చేయడానిక్కి నాక
ఎడిటర్లెవరూ తెలీదే?...."

"హబ్బే.... అటువంటిదేమీ చెయ్యనక్కర్లేదు గానీ నేను రాసిన
కథ చదివి నీ అభిప్రాయం చెప్పు.... చాలు" జోగారావు పొడుగాటి
కవర్లోంచి కథని తీసి ఇస్తూ.




రామస్వామి కథ మొత్తం చదివి నిట్టూర్చాడు.

"ఏం కథయ్యా ఇది?.... ఆ??...." అన్నాడు కళ్ళు చిట్లిస్తూ.

"ఏం? బాగా రాయలేదా??" అన్నాడు జోగారావు.

"ఏం బాగా రాయడమో!.... ఇలాంటి ప్రేమకథలు రాస్తే అయి
నట్టే.... ఈ కథ మొట్టమొదటిసారిగా నాకే కదా చూపించావ్.... వేరే
రచయితలెవర్కీ చూపించలేదు కదా?"

"నీకే చూపించాను. ఎవరైనా పేరున్న రచయితకి కూడా
చూపించి అభిప్రాయాలు, సలహాలు చెప్పమని అడుగుదామనుకుంటున్నా.

"అంతపని మాత్రం చెయ్యకు.... నేను గనక సరిపోయింది.... ఏ రచయితకైనా చూపించానంటే ఇదేం కథరా నాయనోవ్ అంటూ కింద పడి పొర్లి పొర్లి నవ్వుతాడు. లేకపోతే ఏంటోయ్ ఈ కథ? అమ్మాయీ అబ్బాయీ ప్రేమించుకున్నారా? వాళ్ళకి మధ్యలో అపార్థాలు వస్తాయా?.... ఆఖర్న అపార్థాలు పోయి ఇద్దరూ కల్సిపోయి పెళ్ళి చేస్కుంటారా?.... నీ కథ పాడుగాను.... నీ కలం ఇంకిపోను.... ఈ కథని రాసిన నీ చేయి విరిగిపోనూ...." అన్నాడు కసిగా రామస్వామి.

"ఏం?.... ప్రేమ కథ రాయకూడదా?" అమాయకంగా చూస్తూ అడిగాడు జోగారావు.

"రాస్కో.... తర్వాత నాచేత ఇప్పుడు తిట్లు తిన్నావే అలాగే అందరిచేతా తిను.... సమాజానికి ఏ విధంగా ఉపయోగపడ్తుందోయ్ నీ కథ?"

"రాసింది ప్రతీదీ సమాజానికి ఉపయోగపడాలా?"

"మరి.... లేకపోతే నువ్వో డాబ్బా రచయితని అవుతానన్న మాట!!.... రచయితన్న వాడికి సామాజిక స్పృహ ఉండాలయ్యా.... నీ చుట్టూ ఉన్న సమస్యలని తీస్కొని కథలు రాయకుండా కలల్లో తేలిపోయే విధంగా ప్రేమకథలు రాస్తే ఎలా?.... ఈ కథని చింపవతల పారేసి వేరే మాంచి కథ రాసిపట్రా...." అన్నాడు రామస్వామి.

జోగారావు వారం రోజులు కష్టపడి మంచినీళ్ళ కరువు గురించి హాస్యంగానూ వ్యంగ్యంగానూ కథరాసి మళ్ళీ రామస్వామి దగ్గరికి పట్టుకొచ్చాడు.

ఆ కథని రామస్వామి చదివి కిందపడి దొర్లి దొర్లి నవ్వాడు.

"అయితే నేను హాస్యంగా బాగానే రాశానన్నమాట!" సంబర పడిపోతూ అన్నాడు జోగారావు.

"నేన్నవ్వింది నువ్వు హాస్యంగా రాశావని కాదు.... నీ తెలివి తక్కువ తనాన్ని చూసి.... హమ్మమ్మొ హబ్బ.... నీ కడుపుడకా.... హేం నవ్వించావోయ్!" అన్నాడు రామస్వామి పొట్టపట్టుకుని.

"అదేంటి అలా అంటావ్?.... నువ్వేగా అన్నావ్ సామాజిక స్పృహ ఉండే రచనలు చేయాలని? అందుకే మంచినీటి సమస్య తీస్కొని రాశాను...." తెల్లబోతూ అన్నాడు జోగారావు.

"ఇంకా నయం.... మరుగుదొడ్ల గురించి రాశావ్ కాదు.... హిహి హమ్మ నీ జోకులు పాడుగానూ.... ఏం నవ్విస్తున్నావోయ్...."

"మరి సామాజిక స్పృహ ఉన్న కథ అంటే ఏంటి నీ ఉద్దేశంలో? అయోమయంగా మొహంపెట్టి అడిగాడు జోగారావు.

"అదీ కూడా తెలీనివాడిని కథలు రాయడానికి బయల్దేరావ్ పెద్ద మొనగాడ్లా.. ఓ బిచ్చగాడిమీదో, రేప్‌చేయబడ్డ పనిమనిషి మీదో, ఓ కూలివాడిమీదో, లేదా గుడిసెల్లో బతికేవాళ్ళమీదో రాయ్.. అప్పుడది సామాజిక స్పృహ ఉన్న కథావుతుంది. అంతేకాదు.. కథకి టైటిలు కూడా మాంఛి స్పృహ ఉన్న టైటిలు పెట్టాలి.. సరేగానీ పోయిన్సారి నువ్వు ప్రేమ కథ తెచ్చావే.. దానికి టైటిలేం పెట్టావ్?"

"ఆదా?.. 'ప్రేమసామ్రాజ్యం' అని పేరు పెట్టాను" చెప్పాడు జోగారావు.

అది విని రామస్వామి మళ్ళీ కిందపడి పొర్లిపొర్లి నవ్వి.. ఆయాసం తీర్చుకుని లేచి సోఫాలో కూర్చున్నాడు.

"నీ మాయదారి జోకులు పాడుగాను.. నవ్వించి కిందపడేసి నా బట్టలంతా మురికి మురికి చేసేస్తున్నావ్ కదోయ్..హమ్మ.. హబ్బ..హిహి"

"అలా ఊర్కే నవ్వి నా ప్రాణాలు తియ్యంపోతే కథలకిఎలాంటి టైటిలు పెట్టాలో చెప్పేడవరాదూ?" ఉక్రోషంతో అన్నాడు జోగారావు.

"కుంటికుక్క, ఎండుడొక్క, గుడ్డిగద్ద, నెత్తురుకూడు, చమట జీవితాలు....ఇలాంటిటైటిల్స్‌పెడ్తే నీకుసామాజికస్పృహఉన్నట్టన్నమాట!"

"అర్థమైంది. అర్థమైంది.." సంబరంగా బుర్రూపాడు జోగారావ్.

"అలా బుర్రకాయ్ ఊపగానే సరిపోదు.. నేను చెప్పినట్టుగా కథ్రలాయ్ . పో.." అన్నాడు రామస్వామి.

జోగారావు ఈసారి బాగా కష్టపడి పదిరోజులకి ఒక మాంచి సామాజిక స్పృహ కథ రాశాడు.

8)

ఒక భూస్వామి గుడిసెలో ఉండే ఒక వ్యక్తిచేత పని చేయించుకుని ఇవ్వాల్సిన కూలీలో సగం డబ్బులే ఇస్తాడు. అదేమిటని అడిగితే వాడిని రౌడీలతో కొట్టించి వాడి భార్యని రేప్ చేస్తాడు. ఇదీ ఆ కథ సారాంశం కథకి 'గజ్జికుక్క' అని పేరు పెట్టాడు.

ఆ కథని మళ్ళీ రామస్వామి దగ్గరికి తీస్కెళ్ళడానికి భయమేసింది జోగారావుకి.

దీనికి మళ్ళీ ఏం వంకలు పెడ్తాడో?.... ఏకంగా ఏ పత్రిక ఎడిటర్‌కో తీస్కెళ్ళి ఇవ్వడం మంచిదని అనుకున్నాడు.

వెంటనే షర్టూ ప్యాంటూ వేస్కుని రోడ్డుమీదికి వచ్చాడు.

"ఏయ్ రిక్షా...." అని పిలిచాడు.

రిక్షావాడు వచ్చాడు.

"డింగ్ డాంగ్ పత్రికాఫీసుకి వస్తావా?...." అని అడిగాడు జోగారావు.

"అదెక్కడుందండీ?" రిక్షావాడు అన్నాడు.

"రామాపురంలో గాంధీబొమ్మదగ్గర...."

"ఎక్కండి...." అన్నాడు వాడు సీటు దులుపుతూ.

"ఏం తీస్కుంటావ్?" రిక్షా ఎక్కకుండా అడిగాడు జోగారావు.

"అది సర్లేగానీ బాబయ్యా?.... మీరు రిచ్చా తప్ప సిటీ బస్సు ఎక్కరా?" అని అడిగాడు రిక్షావాడు.

"ఊహు.... ఎక్కను.... సిటీ బస్సంటే నాకు చస్తే పడదు...." అన్నాడు జోగారావు గర్వంగా.

"అంటే రిచ్చామీదే ఆధారపడి ఉన్నారు కద బాబయ్యా" హుషారుగా అడిగాడు రిక్షావాడు.

"అంతేకదా మరి.... నేను సిటీ బస్సెక్కి కొన్ని సంవత్సరాలైంది...."

"అద్దదీ అట్టా సెప్పండి.... అట్టాగైతే మీరు నాల్రూపాయలిప్పించాల?" అన్నాడు సంబరంగా.

"నాలుగా?.... అదేంటి అంతెక్కువ చెప్తున్నావ్? అక్కడికి

రెండు రూపాయల కంటే ఎక్కువ తీసోక్కరుగా!?...." ఆశ్చర్యంగా అడిగాడు జోగారావు.

"అదంతే....మీరెట్టాగూ సిటీబస్‌లో ఎల్లలేరు....నచ్చినట్లు నేనడిగినంతా ఇచ్చి ఎక్కాల్సిందే—"అన్నాడు రిక్షావాడు చంకలుగుద్దుకుంటూ.

జోగారావు కాస్సేపు బేరమాడి చూశాడు కానీ కుదర్లేదు. నెత్తి కొట్టుకుని రిక్షాఎక్కి కూర్చున్నాడు.

రిక్షా తొక్కుతున్నంతసేపూ వాడు సణుగుతూనే ఉన్నాడు. "ఇంకా ఎంతదూరం తొక్కాల?! ఇంకా ఎంత దూరం తొక్కాల?!.." అంటూ.

"అదేంటోయ్.. రామాపురంలోని డింగ్‌డాంగ్ పత్రికాఫీసుకి వెళ్ళాలని ముందే చెప్పా కదా?.. అలా సణుగుతావేం.." అంటూ చికాకు పడ్డాడు జోగారావు.

కాస్సేపటికి రిక్షా డింగ్‌డాంగ్ పత్రికాఫీసు ముందు ఆగింది. జోగారావు రిక్షాదిగి, రిక్షావాడి చేతిలో నాలుగు రూపాయలు పెట్టాడు.

"అదేంటి? నాలుగు రూపాయలిస్తున్నారు? మీరు బేరమాడింది అయిదు రూపాయలకి కదా?"అన్నాడు రిక్షావాడు ఆశ్చర్యంగా మొహం పెట్టి.

"అయిదా?.. నాలుగు రూపాయలిప్పించమని నువ్వే కదోయ్ అడిగావ్?" ఇంకా ఆశ్చర్యంగా అన్నాడు జోగారావు.

"హమ్మో.. హమ్మో.. మోసం దగా.. మాలాటి పేదోళ్ళ పొట్ట కొట్టి మేడలూ మిద్దెలూ కడ్తావా?.. అయిదురూపాయలిస్తావా ఛస్తావా?" అంటూ రిక్షావాడు జోగారావు కాలరు పట్టుకున్నాడు.

రోడ్డుమీద ఉన్న మిగతా రిక్షావాళ్ళు జోగారావు చుట్టూ మూగారు.

బైటికి తిడ్తే తంతారుకాబట్టి రిక్షావాళ్ళని మనసులోనే పచ్చిబూతులు తిట్టుకుంటూ అయిదు రూపాయలు ఇచ్చుకున్నాడు జోగారావు.

తరువాత పత్రికాఫీసులోకెల్లి ఎడిటర్‌కి తన 'గజికుక్క' కథని ఇచ్చాడు.అది ఒకనెలరోజుల్లో డింగ్‌డాంగ్‌వారపత్రికలో ప్రచురింపబడింది.

ఆ తరువాత తన రెండోకథ ఒక రిక్షావాడి గురించి రాశాడు. వాడిని అందరూ ఎలా ఎక్స్‌ప్లాయిట్ చేస్తారన్నది చాలా దయనీయంగా రాశాడు జోగారావు. అదికూడా డింగ్‌డాంగ్ పత్రికలో ప్రచురింపబడింది. ఆవిధంగా మాంచి సామాజికస్పృహున్న రచయిత అయ్యాడు జోగారావు.